క్లుప్తంగా

ప్రత్యేక పూజలు చేసిన సీఐ



సిరిసిల్ల: పట్టణంలోని భావనారుషినగర్ రజక యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినాయకుడి మండలం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కరాజు శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, రజక సంఘం ప్రతినిధులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. స్థానికులు అన్నప్రసాదం స్వీకరించారు.

మూడు మండలాల్లో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో మూడు మండలాల్లో గురువారం చిరుజల్లులు కురిశాయి. వేములవాడ రూరల్, బోయినపల్లిలో 0.3 మి.మీ వర్షంపడగా.. ఇల్లంతకుంటలో 0.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా జిల్లాలోని పది మండలాల్లో పొడి వాతావరణం నెలకొంది.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సిరిసిల్లఅర్బన్: ఈనెల 6న రామడుగులో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో సిరిసిల్లకు చెందిన జిందం వర్షిత్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కోచ్ కృష్ణహరి తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో హన్మకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్పష్టం చేశారు.

జాతీయ బీసీ యువజన సంఘం కార్యదర్శిగా అజయ్



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి ఐదో వార్డులోని గొల్లపల్లెకు చెందిన అమరగొండ అజయ్‌ని జాతీయ బీసీ యువజన సంఘం కార్యదర్శిగా నియమించినట్లు జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ తన నియామకానికి నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, గవ్వల భరత్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే జిల్లా, మండలల కమిటీలను నియమిస్తామని తెలిపారు.

పొన్నాల రమేశ్‌కు డాక్టరేట్



పొన్నాల రమేశ్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

తంగళ్లపల్లి: మండలంలోని వేణుగోపాలపూర్‌కు చెందిన పొన్నాల రమేశ్‌ను డాక్టరేట్ వరించింది. ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రమేశ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కాగా మెషిన్ లర్నింగ్ టెక్నిక్స్‌లో క్లాస్ అసమతుల్యత, ఫీచర్ తగ్గింపు పరిష్కారం అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. రమేశ్‌ను ఆయన కుటుంబ సభ్యులతోపాటు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఇల్లంతకుంట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి బన్నాజీ అన్నారు. గాలిపెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్‌ఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంఈవో బన్నాజీని సన్మానించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అశోక్ రెడ్డి, మండల ఎస్‌జీఎఫ్ ఎఫ్ కన్వీనర్ సంపత్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పులిం రాజు అన్నారు. పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలోని మహాత్మా జ్యోతి బాపూలే క్రీడా ప్రాంగణంలో మండల ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ప్రారంభించారు. పీడీలు హమీద్, రవీందర్‌రావు, పీఈటీలు ఉన్నారు.

ముస్తాబాద్: గ్రామీణ క్రీడలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలురకు నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, మాజీ ఎంపీటీసీలు నాయకులు భాను, శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.

నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల క్రైం: పట్టణంలో నిర్వహించే నిమజ్జన వేడుకల్లో నిబంధనలు పాటించాలని లేకపోతే చర్యలకు తప్పవని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. గురువారం సిరిసిల్ల టౌన్‌పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఐదు ఫీట్లున్న గణపతి విగ్రహాలు దాదాపు 450 వరకు ఉన్నాయని, మంగళవారం నిమజ్జనం చేయాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని, నిమజ్జన వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం చేసిన మండప పరిసరాలను శుభ్రంచేసి రోడ్డు వెంట ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

సిబ్బందికి సహకరించాలి

తంగళ్లపల్లి: వినాయక నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని ఇంపీరియల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మండలంలోని 30 గ్రామాల్లో 237 వినాయక మండపాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. గణనాథుల నిమజ్జనం సమయంలో పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఎస్సై సుధాకర్, పోలీస్‌సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న సీఐ మొగిలి

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

వేములవాడరూరల్: గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. హన్మాజిపేటలో మీ కోసం కార్యక్రమం నిర్వహించగా హాజరై మాట్లాడారు. ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా శాంతియుతంగా వినాయక నిమజ్జనం జరుపుకోవాలన్నారు. రోడ్డు భద్రత, డయల్ 100, సైబర్ క్రైం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



వేములవాడ రూరల్: హన్మాజిపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే లక్ష్యం

సిరిసిల్లటౌన్: పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. గురువారం బల్దియాలో పనిచేస్తున్న 350 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, సిబ్బందికి ఈపీఎఫ్ ఖాతాలు తెరిపించి వాటిలో ప్రతినెలా పద్దులు జమ చేస్తున్నామన్నారు. తద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. ఇటీవల దురదృష్టవశాత్తు మృతిచెందిన ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ఈపీఎఫ్ కార్యాలయం ద్వారా రావాల్సిన పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్ మంజూరుపత్రాలను అందజేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో సేవలందించిన పారిశుధ్య కార్మికులు మేర్గు రామస్వామి, తుమ్మ బాలరాజు, సిరిగిరి సురేశ్ మృతిచెందగా బాధిత కుటుంబాలకు ఈపీఎఫ్, ఇన్సూరెన్స్ పత్రాలు అందించగా వారు హర్షం వ్యక్తంచేశారు. ఈపీఎఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మేర్గు రామస్వామి (రూ. 5,80,908), తుమ్మ బాలరాజు(రూ.4,06,966), సిరిగిరి సురేశ్ (రూ. 4,00,000) పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు పత్రాలు అందిస్తున్న చైర్‌పర్సన్ కళ

అధికారులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్ల అర్బన్: జిల్లా కేంద్రం శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో 516 అపార్ట్‌మెంట్ నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. వేణు మాట్లాడుతూ అనుమతించిన స్థలంలో ప్రభుత్వ భూమి ఆనుకొని, మిడ్‌మానేరు బఫర్ జోన్‌లో ఉందన్నారు. నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ: నాగిరెడ్డి మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

గణనాథుడికి ప్రత్యేక పూజలు

వేములవాడ : వేములవాడ రాజన్న ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో ఏర్పాటు చేసిన గణేశుడికి ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా పూజలు నిర్వహించారు.పట్టణంలోని పలు వినాయక మండపాల్లో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. మండపాల నిర్వాహకులు విప్‌నుసన్మానించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బోయినపల్లి: మండలంలోని మాన్వాడ, కొదురుపాక, బోయినపల్లి, తడగొండ, వెంకట్రావుపల్లి తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు, అన్నదానాలు చేశారు. మండపాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట, కనగర్తి, నిజామాబాద్, మల్కపేట, మరిమడ్ల గ్రామాల్లో అన్నదానం చేశారు. పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనరావుపేటలో వైశ్యసంఘం ఆధ్వర్యంలో 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, మాజీ ఎంపీటీసీ యాస్మిన్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి : మహిళల కుంకుమ పూజలు



కోనరావుపేటలో 108 నైవేద్యాలతో పూజలు

చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

వేములవాడ: పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయ ప్రాంతంలో చెత్తను రోడ్డుపైనే పడేస్తుండగా ఈనెల 10న ×కంపుకొడుతోంది¥ అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి పారిశుధ్య సిబ్బందితో చెత్తను తొలగించి దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో కాలనీవాసులు, స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

కోతుల దాడిలో పంట ధ్వంసం

కోనరావుపేట: మండలంలోని కనగర్తికి చెందిన పోగుల రాజు రెండెకరాల్లో పత్తి పంట సాగుచేస్తుండగా తెల్లవారుజాము కోతుల గుంపు పంటను ధ్వంసంచేశాయి. ఇదే గ్రామానికి చెందిన రావుల పెల్లి మహిపాల్‌రెడ్డికి చెందిన ఎకరం పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. అధికారులు విచారణ జరిపి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

● **నరేందర్ రెడ్డికి టీటీఎల్ఎఫ్ మద్దతు**

సిరిసిల్ల కల్చరల్: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డికి తెలంగాణ టీచర్స్ లెక్చరర్స్ ఫోరం మద్దతు ప్రకటించింది. గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఫోరం అధ్యక్షుడు మాసం రత్నాకర్ మాట్లాడారు.

● **కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు శోచనీయం**

సిరిసిల్లటౌన్: మహిళల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు శోచనీయమని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళ లోకాన్ని కించపరుస్తూ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోసారి మహిళలను కించపరిచినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

● **అంబేడ్కర్ విగ్రహంపై అపోహలు వద్దు**

వేములవాడ: రాజన్న ఆలయం పక్కనే ఉన్న అంబేడ్కర్ విగ్రహం జంక్షన్ అభివృద్ధిని చేస్తు న్న క్రమంలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగిస్తారనీ, మరోచోటకు మార్చుతారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని ఆర్డీవో రాజేశ్వర్ గురువారం తెలిపారు. జంక్షన్ అభివృద్ధి తోపాటు సుందరీకరణ చేస్తూ అంబేడ్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచుతామన్నారు.

● **సోషల్‌మీడియాలో మూలవిరాట్టు వైరల్ !**

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలోని మూలవిరాట్టు శ్రీలక్ష్మీగణపతి దేవుడి ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటం వేములవాడలో చర్చనీయాంశమైంది. గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలోని మూలవిరాట్టు శ్రీలక్ష్మీగణపతి దేవుడిని ఆలయ అధికారులు ఒక్కోరోజు ఒక్కో అలంకారంతో అలంకరిస్తున్నారు. ఈక్రమంలోనే ఎవరో మూలవిరాట్టు ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. ఆలయంలో శ్రీస్వామివారు, అమ్మవారు, శ్రీలక్ష్మీగణపతి మూలవిరాట్టులుగా ఏర్పాటు చేశారు.

● **రూ.6వేల కోట్లు విడుదల చేయాలి**

సిరిసిల్ల అర్బన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో భారీ నష్టం జరిగినందున కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి రూ.6వేల కోట్లు విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండగా గండ్లు పడి మట్టిరోడ్లు తెగిపోయాయన్నారు. వరదనీరు ఇళ్లలోకి చేరి ప్రజలు నష్టపోయారన్నారు. వేలాది ఎకరాల్లో పంటపొలాలు నీట మునిగి రైతులు నష్టపోయారన్నారు. సీపీఐ నాయకులు పంతం రవి, కడారి రాములు, మంద సుదర్శన్, సోమ నాగరాజు, వేణు తదితరులు ఉన్నారు.

● **సీపీఎం నేతల నివాళి**

సిరిసిల్లటౌన్: అఖిల భారతీయ సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కార్మిక, పీడిత వర్గాలకు, దేశ రాజకీయాలకు తీరని లోటని జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. గురువారం ఏచూరి మృతిచెందగా అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఎం నాయకులు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, సూరం పద్మ, జువ్వాజి విమల, శ్రీరాం సదానందం, మిట్టపల్లి రాజమల్లు, సిరిమల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

● **కార్యవర్గం ఎన్నిక**

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంబేడ్కర్ సంఘం సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా గడ్డం నాగరాజు, ఉపాధ్యక్షులుగా గడ్డం ప్రశాంత్, నగునూరి శివ, అకునూరి అజయ్, వడ్లూరి ప్రశాంత్, గడ్డం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆకునూరి సుధీర్, సహాయ కార్యదర్శులుగా నక్క నవీన్, ఆకునూరి అభిషేక్, కలికోట దేవి ప్రసాద్, నేదూరి చంద్రశేఖర్, కోశాధికారిగా ఆకునూరి శంకరయ్య, కార్యవర్గ సభ్యులుగా పవన్, జ్ఞానేశ్వర్, క్రాంతి, శివ, పూర్ణ చందర్, వేణు, రాకేశ్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

● **తహసీల్దార్‌కు వినతి**

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ ఎస్సీ, బీసీ కాలనీల పరిసరాల్లో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఆ ప్రాంతం ప్రజలు గురువారం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గతంలో నిర్మించిన శ్మశాన వాటిక సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో, బీసీ, ఎస్సీ కాలనీల నివాసప్రాంతంలో ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు అవస్థలు పడుతున్నట్లు తహసీల్దార్‌కు వివరించారు.

● **సభ్యత్వ నమోదు పూర్తిచేయాలి**

ఇల్లంతకుంట : మండలప్రజలు బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించారని భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలో గురువారం జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పార్టీ నిర్దేశించిన సమయానికి సభ్యత్వ కార్యక్రమం పూర్తిచేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. పార్టీ కార్యకర్తలు మేకల మల్లేశం, అశోక్, సాయిలు, ముత్తక్క, శ్రీకాంత్, బత్తిని స్వామి, తదితరులు పాల్గొన్నారు.

● **కౌశిక్‌రెడ్డిపై దాడి సరికాదు**

ఇల్లంతకుంట: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అరికెపూడి గాంధీ తన అనుచరులతో వెళ్లి దాడిచేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ కుట్రలో భాగంగానే ఈదాడి జరిగిందన్నారు. కౌశిక్ రెడ్డిని పోలీసులతో ఇంటిలోనే నిర్బంధించిన ప్రభుత్వం అరికెపూడి గాంధీని మాత్రం వందలాది అనుచరులతో కౌశిక్ రెడ్డి ఇంటిపైకి వెళ్లి దాడిచేసేలా ఉసిగొల్పడం ఏంటని ప్రశ్నించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

● **నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**

ముస్తాబాద్: మండలంలో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం ఉత్సవాలను నిర్వహించుకోవాలని తహసీల్దార్ సురేశ్ అన్నారు. ముస్తాబాద్ పెద్ద చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 15 నుంచి చెరువులు, మానేరు వాగులో నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సై గణేశ్, ఈవో రమేశ్, ఆర్ఐ రఘు, భిక్షపతి, రాజు తదితరులున్నారు.

● **సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

తంగళ్లపల్లి: నియోజకవర్గ పద్మశాలీలకు బతుకమ్మ చీరల ఆర్డర్ ఇచ్చి రూ.30 కోట్లు విడుదల చేసినందుకు హర్షం వ్యక్తంచేస్తూ మండలకేంద్రంలో పద్మశాలీ నాయకులు సంబరాలు జరిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పద్మశాలీ నాయకులు మచ్చ శ్రీనివాస్, రాపెల్లి ఆనందం, ఆంకారపు మహేశ్, గోనె ఎల్లప్ప, మోర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● **మంత్రివర్గంలో స్థానం కల్పించాలి**

కోనరావుపేట: ప్రభుత్వం తొమ్మిది నెలలు గడుస్తున్నా లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం బాధాకరమని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ అన్నారు. మండలంలోని నిమ్మపల్లిలో గురువారం మాట్లాడుతూ... మంత్రివర్గంలో లంబాడీ గిరిజనుల ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలనాయకులు సాగర్‌నాయక్, తిరుపతి నాయక్, రమేశ్‌నాయక్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

● **నెమలిని కాపాడిన అటవీశాఖ సిబ్బంది**

చందుర్తి: మండలకేంద్రం శివారు పెద్దమ్మ గుడి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడిన నెమలిని అటవీశాఖ అధికారులు కాపాడారు. రెండ్రోజులక్రితం బావిలో నెమలి పడింది. ఫారెస్ట్ బీట్ అధికారి రాజశేఖర్ బావిలోకి దిగి నెమలిని బయటకు తీశారు. ప్రథమ చికిత్స చేయించి అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు బీట్ అధికారి తెలిపారు. సిబ్బంది సలీం, శంకర్ తదితరులున్నారు.



చందుర్తి : మండలంలోని ఎన్గల్ క్రీడా ప్రాంగణంలో వద్ద ఏర్పాటు చేసిన స్తంభం ఇటీవల కురిసిన వర్షాలకు వంగి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఏర్పాటు సమయంలోనే పైపైన స్తంభాన్ని పాతడంతో వంగిపోయింది. పూర్తిగా కూలిపోతే లైట్లు పగిలిపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

సంప్రదించాల్సిన అధికారి: నరేశ్, పంచాయతీ కార్యదర్శి, ఎన్గల్, ఫోన్ నెంబర్ : 9963142478

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048, 9705346626

ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శికి రాజన్న ప్రసాదం



ప్రసాదం అందజేస్తున్న సంటి మహేశ్

వేములవాడ: ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియాకు వేములవాడ రాజన్న ప్రసాదాన్ని ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్ గురువారం వరంగల్ సభలో అందజేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోక్సోచట్టంపై అవగాహన

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బాలికల గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో గురువారం ఎస్సై శ్రీకాంత్ గౌడ్ పోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించరు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో గురువారం భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	04	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	34	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	06	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	12	1,008
నందీశ్వర నాన్ఏసీ	28	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	33	448
పార్వతీపురం స్పెషల్	18	672
పార్వతీపురం సాధారణ	10	336

- వేములవాడ

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముస్తాబాద్: గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కు గురువారం విజ్ఞప్తి చేసినట్లు గీత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లో స్పీకర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశామన్నారు. గీత కార్మికులకు సేఫ్టీ మోకులను ఇవ్వాలని, అలాగే అర్హులైన గీత కార్మికులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరామన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు, పులి లక్ష్మీపతిగౌడ్, ఎల్లారెడ్డిపేట సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కోల నారాయణగౌడ్ తదితరులున్నారు.



స్పీకర్‌కు సమస్యలు తెలుపుతున్న నాయకులు

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

రుద్రంగి: పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని చందుర్తి, రుద్రంగి మండల ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. రుద్రంగిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు పాత పెన్షన్ విధానం అమలుచేస్తామని హామీ ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఉపాధ్యాయులు తిరుపతి, ముఖేష్, శ్రీనివాస్, నరేశ్, రవి, అమృత్ లాల్, జలందర్ రెడ్డి, బాలకిషన్, రమేశ్, మీనాక్షి, శ్యామల పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఉద్యోగులకు పాతపింఛన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు సంతకాలు సేకరణ చేపట్టారు. మండల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం భోజన విరామ సమయంలో సంతకాలు సేకరణ చేపట్టారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పాత పింఛన్ విధానం కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ రాజశేఖర్ రెడ్డి, రామలింగారెడ్డి, వంశీకృష్ణ ,ఆవునూరి సరోజ, స్రవంతి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. పాతపింఛన్ విధానం అమలు చేసి ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.



రుద్రంగి: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రూ.20లక్షలతో ఉడాయించిన మహిళా వ్యాపారి?

కోనరావుపేట: తెలిసిన వారు, బంధువుల వద్ద రూ. 20లక్షల వరకు అప్పులు తీసుకొని ఓ మహిళా వ్యాపారి ఉడాయించింది. మండలంలోని వెంకట్రావుపేటలో కిరాణదుకాణం నడిపే మహిళా కొద్దిరోజులుగా తెలిసిన వారి వద్ద అధికవడ్డీ ఆశచూపి రూ.20లక్షల వరకు అప్పులు తీసుకుంది. కొన్నాళ్లు వడ్డీ సరిగ్గానే చెల్లించిన ఆమె వారంరోజులుగా కనిపించడం లేదు. ఆమె ఇంటికి సైతం తాళం వేసి ఉంది. ఇటీవల ఇంటిని, వేములవాడలోని వారి భూమిని సైతం విక్రయించినట్లు సమాచారం. పలువురు బా ధితులు గురువారం ఎస్సై శేఖర్‌రెడ్డిని కలిసి తమకు న్యాయంచేయాలని మొరపెట్టుకున్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

కోనరావుపేట: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీవివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం మాట్లాడారు. వెంకటి, మోహన్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు న్నారు.